క్లుప్తంగా

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్కం డ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

వాహనాల వేలం రేపు

వడమాలపేట: తిరుపతి జిల్లా వడమాలపేట పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 15వ తేదీన వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 15న ఉదయం 9 గంటలకు పోలీస్ స్టేషన్‌లో నిర్దేశించిన డిపాజిట్ రుసుం చెల్లించి రసీదు తీసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి వేలం ప్రారంభమవుతుందని తెలిపారు.

18న కల్యాణ వెంకన్న పుష్పయాగం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 18న పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 17వ తేదీ సాయంత్రం అంకురార్పణ, మార్చి 18న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం చేపడతారు. 18న నిత్య కల్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 43 మందికి రూ.86 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరి తెలిపారు. నిందితులను తిరుపతి ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- నగరి నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లు 83.28 శాతం పోలింగ్
- ఉపాధ్యాయుల ఓట్లు 93.02 శాతం పోలింగ్
- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం


విజయపురంలో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు


నగరిలో బందోబస్తు పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రవికుమార్



నగరి, విజయపురంలో చంటి బిడ్డలతో ఓటు వేయడానికి వచ్చిన మహిళలు


నగరిలో ఓటువేసి వెళుతున్న దివ్యాంగుడు


వడమాలపేటలో ...


పుత్తూరులో బారులు తీరిన ఓటర్లు



పుత్తూరులో ఓటు వేయడానికి వస్తున్న దివ్యాంగురాలు, ఓటు వేసిన నగరి ఎంపీపీ భార్గవి


పుత్తూరు పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రామరాజు

నగరి: తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలు నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓటింగ్‌లో 83.27 శాతం, ఉపాధ్యాయుల ఓటింగ్‌లో 93.02 శాతం ఓట్లు పోలయ్యాయి. పార్టీల చిహ్నాలు లేకుండా అభ్యర్థుల ప్రాధాన్యత ఆధారంగా జరిగే ఎన్నికలు కావడం, ఒక్కొక్కరు ఓటరు స్లిప్పుపై ప్రాధాన్యత ఆధారంగా కొందరికి అంకెలు గుర్తించాల్సి రావడంతో పోలింగ్‌కు సమయం పట్టింది. దీంతో జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నగరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నగరి, మండల మున్సిపల్‌కు సంబంధించిన 5 బూత్‌లలో, పుత్తూరు డిగ్రీ కళాశాలలో పుత్తూరు మున్సిపల్, మండల పరిధిలో చెందిన 5 బూత్‌లలో, విజయపురం, నింద్ర, వడమాలపేట మండల కేంద్రాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌ల చొప్పున 6 బూత్‌లలో పోలింగ్ జరిగింది. ఉదయం పదిగంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆపై వేగం పుంజుకుంది. పసిబిడ్డల తల్లులు, దివ్యాంగులు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొనడం ప్రత్యేకంగా నిలిచింది. ఆర్డీఓ సుజన పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. నగరి డివిజన్‌లో డీఎస్పీ రవికుమార్ పోలింగ్ కేంద్రం వద్దే ఉంటూ భద్రతా చర్యలను పర్యవేక్షించారు. వీరితో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రాయలు, నాగరాజు, ఎంపీడీవోలు చంద్రమౌళి, సతీష్, వేణు, పుత్తూరు డివిజన్‌లో ఇన్‌చార్జ్ డీఎస్పీ రామరాజు, తహసీల్దార్ సుబ్రమణ్యం ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ తొలుత మందకొడిగా సాగినా క్రమేపీ పెరుగుతూ వచ్చింది. పుత్తూరు మండల పరిధిలో 2838 మంది పట్టభద్రులకు గాను 2338 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 318 మంది ఉపాధ్యాయులకు గాను 298 మంది ఓటు వేశారు. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ సమయం ముగియడంతో గ్రాడ్యుయేట్ 82.4 శాతం, టీచర్స్ 93.7 శాతం పోలింగ్ జరిగినట్లు పోలింగ్ ఎన్నికల అధికారులు తెలిపారు. పట్టభద్రులకు 4 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పుత్తూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ రామరాజు నేతృత్వంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు వెంకటమోహన్, గౌరీశంకర్‌ల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పోలింగ్ సాఫీగా సాగింది.

మండలాల వారీగా పట్టభద్రుల పోలింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
నగరి	2631	2181	83.00
పుత్తూరు	2829	2337	87.73
విజయపురం	775	657	84.77
నింద్ర	693	608	87.73
వడమాలపేట	821	671	81.72
మొత్తం	7749	6454	83.27

మండలాల వారీగా ఉపాధ్యాయ ఓట్ల పోలింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
నగరి	196	183	93.36
పుత్తూరు	318	298	93.71
విజయపురం	26	25	97.00
నింద్ర	41	39	95.00
వడమాలపేట	64	55	85.00
మొత్తం	645	600	93.02

పెయింటింగ్ ఆర్టిస్ట్ నూతన కమిటీ ఎంపిక


తిరుపతి పెయింటింగ్ ఆర్టిస్ట్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న అతిథులు, నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతి పెయింటింగ్ ఆర్టిస్ట్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కేవీ.మోహన్ ఎంపికయ్యారు. బాబూ జగ్జీవన్ భవన్‌లో సోమవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ సుకుమార్ హాజరై అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడుగా వైఎస్.గోపీనాథ్, సలహాదారులుగా కె.సుధాకర్, రాజేంద్ర, ఉపాధ్యక్షుడిగా టి.జ్ఞానసుందర్, కార్యదర్శిగా సుబ్రమణ్యం, కోశాధికారిగా మురుగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ సెక్రటరీగా సంజీవ్‌కుమార్



తిరుపతి లీగల్: రాష్ట్ర న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జోనల్ సెక్రటరీగా తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉద్యోగి సీహెచ్ వెంకటసంజీవ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప జిల్లా కోర్టు ఆవరణలో రెండు రోజుల క్రితం రాష్ట్ర న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రామరాజ చంద్రశేఖర్, ముఖ్య సలహాదారు ఎస్.మస్తాన్‌వలి, కోశాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య కార్య దర్శిగా ఎస్.ప్రసాద్, అదనపు కార్యదర్శిగా రెడ్డికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటసంజీవ్‌కుమార్ ఎన్నికపై తిరుపతిలోని కోర్టుల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కవియిత్రి మొల్ల జయంతి వేడుకలు



కవియిత్రి మొల్ల విగ్రహానికి పూజలు చేసి పుష్పాంజలి ఘటిస్తున్న కవియిత్రి మొల్లమాంబ సాహితీ పీఠం చైర్మన్, బీసీ నేతలు, కవియిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: కవియిత్రి మొల్లమాంబ జయంతిని సోమవారం సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహతి కళాక్షేత్రం వద్దనున్న సర్కిల్‌లోని మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కవియిత్రి మొల్లమాంబ సాహితీ పీఠం చైర్మన్ బీవీ.కేశవులు, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ జమున, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, ఆర్‌జేయూపీ అధ్యక్షుడు టి.గోపాల్, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, అధికార భాషా సంఘం సభ్యురాలు డి.మస్తానమ్మ, రజక సంఘం నేత అక్కినపల్లి లక్ష్మయ్య, శాలివాహన యువజన నేత వెంకటేష్, ఎస్వీయూ ఎకనామిక్స్ విభాగం హెడ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మొల్ల జయంతిని నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, సుబ్రమణ్యంరెడ్డి, మునిక్రిష్ణయ్య యాదవ్, పొన్నాల జేజిరెడ్డి, ఆముదాల నారాయణ, కె.కేశవులురెడ్డి పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో పోటెత్తిన ఓటర్లు

- నియోజకవర్గంలో భారీగా ఓటింగ్‌శాతం నమోదు
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- ఎన్నికల సరళిని పర్యవేక్షించిన అధికారులు


పాలసముద్రం : పటిష్ట బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న అధికారులు


కార్వేటినగరం: ఓటు వేయడానికి వచ్చిన దివ్యాంగుడు



పాలసముద్రం: చంటి పిల్లతో ఓ పట్టభద్రురాలు, కార్వేటినగరం: పోలింగ్ కేంద్రం వద్ద..


శ్రీరంగరాజపురం: బారులు తీరిన పట్టభద్రులు


పెనుమూరులో..


వెదురుకుప్పం: పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


జీడీనెల్లూరులో పోలింగ్‌ను పరిశీలిస్తున్న అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

కార్వేటినగరం: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం నియోజకవర్గం ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 8464 మంది ఉండగా 6538 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ శాతం 77గా నమోదైంది. అదేవిధంగా నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఓటర్లు 464 మంది ఉండగా 408 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ 87 శాతం నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పలుచోట్లు దివ్యాంగులు, చంటిపిల్లల తల్లులు, గర్భిణులు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేయడం గమనార్హం.

మండలాల వారీగా ఇలా..

- గంగాధరనెల్లూరు మండలంలో పట్టభద్రులు మొత్తం 2417 మంది ఉండగా అందులో 1727 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 68 శాతం నమోదు అయ్యింది. అలాగే ఉపాధ్యాయులు మొత్తం 96 మందికి 85 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 88గా నమోదు అయ్యింది.
- కార్వేటినగరం మండంలో మొత్తం పట్టభద్రులు 1493 మంది ఉండగా అందులో 1219 మంది తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో 81.6 శాతం మంది ఓఓటు హక్కును నమోదు చేసుకున్నారు.అలాగే ఉపాధ్యాయులు 115 మంది ఉండగా అందులో 99 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 79గా నమోదైంది.
- శ్రీరంగరాజపురం మండలంలో పట్టభద్రులు మొత్తం 1278 మంది ఉండగా, 1022 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 79 శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 68 మంది ఉండగా, 57 మంది ఓటు వేయడంతో 83 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.
- పెనుమూరు మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 1193 మందికి గానూ 935 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 78 శాతం ఓటింగ్ జరిగింది. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 96 మంది ఉండగా అందులో 86 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో మొత్తం 89 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు చెప్పారు.
- వెదురుకుప్పం మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1684 మంది ఉండగా 1294 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ 76 శాతం నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు 79 మంది ఉండగా 71 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 89 శాతం పోలింగ్ నమోదైంది.
- పాలసముద్రం మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 399మంది ఉండగా 341 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, దీంతో 85 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 10 మంది ఉండగా 10 మంది తమ ఓటు హక్కును వినియోగించుకుని వందశాతం నమోదైనట్లు తెలిపారు. మండలంలో గర్భిణులు, చంటి పిల్లలను తీసుకుని వచ్చిన మహిళలు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పేర్నాటి గెలుపు ఖాయం


సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నగరి: తూర్పురాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన శైలిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. పేర్నాటి గెలుపు ఖాయమంటూ సోమవారం రాత్రి మంత్రి ఆర్‌కే రోజా నివాసం వద్ద ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. విజయకేతనం చూపుతూ తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్ రెడ్డి మట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థికి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి అధికశాతం ఓట్లు పోలైనట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, మంత్రి ఆర్‌కే రోజా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు పడేలా చేశాయన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు పోలింగ్ రోజున వైఎస్సార్‌సీపీ కేడర్ సైనికుల్లా పనిచేశారన్నారు. ఎన్నికల కోసం కష్టపడి పని చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లు బాలకృష్ణ, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లీబాబు, మండల సచివాలయ కన్వీనర్ హరి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.